నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, బుధవారం 6 నవంబర్ 2024 RANGAREDDY




మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో ముచ్చటించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# ఉపాధ్యాయుల 'ధర్మాగ్రహం'

**డీఏలు, పెండింగ్ బిల్లులతో పాటు పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్**

**రంగారెడ్డి కలెక్టరేట్, వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట**

**ఉపాధ్యాయుల దీక్ష.. వినతి పత్రాలు అందజేత**




రంగారెడ్డి కలెక్టరేట్ ఎదురుగా ఉపాధ్యాయుల దీక్ష



వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు


వికారాబాద్/ఆదిబట్ల, నవంబర్ 5 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన నాలుగు డీఏలు, పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు 'ధర్మాగ్రహ' దీక్ష చేపట్టాయి. మంగళవారం టీపీయూఎస్ ఆధ్వర్యంలో రంగారెడ్డి కలెక్టరేట్, వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట జరిగిన దీక్షల్లో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు. అనంతరం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తపస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తగడి అంజిరెడ్డి, టీపీయూఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌లు మాట్లాడారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. ఈ నెల 23న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ధర్మాగ్రహ దీక్షలో వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర కోశాధికారి కరణం లక్ష్మీకాంతారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర బహదూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. ఈ దీక్షకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి మద్దతు తెలిపారు. ధర్నాలో రాష్ట్ర బాధ్యులు రాములు, జాక వెంకటేశం, కమాల్ రెడ్డి, ఆనందం, బుచ్చిలింగం, జిల్లా ఉపాధ్యక్షుడు బాకారం మల్లయ్య, కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటేశం, సంగమేశ్వర్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు రమాదేవి, శ్రీలత పాల్గొనగా, రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

---

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వికారాబాద్ జిల్లాలో నేటి నుంచి ప్రారంభం కానున్నది. అయితే సర్వేకు ప్రభుత్వం కేటాయించిన సమయంపై గందరగోళం నెలకొన్నది. ప్రస్తుతం వరి కోతలు, పత్తి తీత పనులు జోరుగా సాగుతున్న వేళ మధ్యాహ్నం సమయంలో సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఎన్యూమరేటర్లు తలలు పట్టుకుంటున్నారు. రైతులు, కూలీలు ఇండ్లకు తాళాలు వెళ్లి పొలాలకు వెళ్తారని.. వ్యాపారులు, ఉద్యోగులు తమ తమ పనులకు వెళ్తారని.. అప్పుడు సర్వే ఎలా సవ్యంగా సాగుతుందని పేర్కొంటున్నారు. యజమానులు అందుబాటులో లేకుంటే మళ్లీ మళ్లీ ఇండ్ల వద్దకు వెళ్లాల్సి వస్తుందని.. అప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు సర్వే పూర్తి కాదని.. అందువల్ల ఒక్కో ఎన్యూమరేటర్‌కు కుటుంబాల సర్వే బాధ్యతలు తగ్గించాలని కోరుతున్నారు. కాగా వికారాబాద్ జిల్లాలో మొత్తం 2,63,362 కుటుంబాలు ఉండగా.. సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం 2024 మంది ఎన్యూమరేటర్లు, పర్యవేక్షణకు 208 మంది సూపర్‌వైజర్లను నియమించింది.

-పరిగి, నవంబర్ 5





# సర్వే సవ్యంగా సాగేనా?

**నేటి నుంచి సమగ్ర కుటుంబ సర్వే**

- సర్వేకు కేటాయించిన సమయంపై గందరగోళం
- ప్రస్తుతం జోరుగా వరి కోతలు, పత్తి తీత పనులు
- మధ్యాహ్నం వేళల్లో రైతులు, కూలీలు, వ్యాపారులు, ఉద్యోగులు అందుబాటులో ఉంటారా..?
- తలలు పట్టుకుంటున్న ఎన్యూమరేటర్లు
- ఇండ్లకు తాళాలుంటే మళ్లీ మళ్లీ సర్వే చేపట్టాల్సిందే..
- ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు సర్వే పూర్తి గగనమే..
- సర్వే చేయాల్సిన కుటుంబాల సంఖ్య తగ్గించాలంటున్న ఎన్యూమరేటర్లు
- సర్వే కోసం 2024 మంది ఎన్యూమరేటర్లు, 208 మంది సూపర్‌వైజర్లు

**వికారాబాద్ జిల్లాలో మొత్తం కుటుంబాలు 2,63,362**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ(సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) సర్వేకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వికారాబాద్ జిల్లాలో ఉన్నటువంటి 20 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల్లో నేటి నుంచి ప్రారంభమై ఈ నెల 18 తేదీ వరకు అంటే 13 రోజుల పాటు ఏకకాలంలో కొనసాగనున్నది. అయితే సమగ్ర కుటుంబ సర్వే కోసం ప్రభుత్వం నిర్దేశించిన సమయంపై గందరగోళం నెలకొన్నది. సాధారణంగా ఏ సర్వే చేసినా ఉదయం పూట చేపడితే ప్రజలు అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం నుంచి సర్వే చేయమంటే ఎలా గని ఎన్యూమరేటర్లు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయానికి సంబంధించి పత్తి తీసే పనులు, వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. దీంతో రైతులు మొదలుకొని కూలీ పని చేసే వారంతా ఈ పనుల్లో బిజీగా ఉంటారు. కొందరు కూలీలు ఇతర గ్రామాలకు వెళ్లి పని చేస్తున్నారు. వారంతా ఉదయం 8 గంటలకు తమ గ్రామాల నుంచి బయలుదేరి.. తిరిగి సాయంత్రం 7 గంటల తర్వాతే ఇండ్లకు వస్తారు. దీంతో గ్రామాల్లో సగం కంటే ఎక్కువ ఇండ్లు మధ్యాహ్నం సమయంలో తాళాలు వేసే ఉంటాయి. మరోవైపు ఉద్యోగులు, చిరు వ్యాపారులు సైతం మధ్యాహ్నం సమయంలో తమ పనుల్లో నిమగ్నమై ఉంటారు. సర్వే సందర్భంగా తప్పనిసరిగా కుటుంబ యజమాని అందుబాటులో ఉంటేనే పూర్తి వివరాలు సేకరించే అవకాశం ఉంటుంది. అలాంటిది అందరూ పనులకెళ్తే సర్వే చేయడం ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఒక కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించేందుకు కనీసం 15 నుంచి 20 నిమిషాల సమయం పడుతుందని.. అందువల్ల ఒక్కో ఎన్యూమరేటర్‌కు 100 నుంచి 150 కుటుంబాలు ఇవ్వాలని కోరగా 175 ఇవ్వడంతో సమయం సరిపోదని పేర్కొంటున్నారు. కుటుంబ యజమాని అందుబాటులో లేకుంటే మళ్లీ మళ్లీ ఆ ఇంటికి వెళ్లి సర్వే చేయాల్సి ఉంటుందని.. అందువల్ల ఎన్యూమరేటర్లకు కేటాయించిన కుటుంబాల సంఖ్యను తగ్గించాలనే డిమాండ్ వినిపిస్తున్నది. ఇదిలావుండగా సర్వే కోసం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను ఎన్యూమరేటర్లుగా నియమించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రాథమిక పాఠశాలలు మధ్యాహ్నం వరకే కొనసాగనున్నాయి. దీంతో ప్రాథమిక పాఠశాలలపై భారం పడుతుందని, ఒత్తిడి పెరుగుతుందని ఉపాధ్యాయ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ప్రతి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలతో పాటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో సగం మందిని సర్వే కోసం తీసుకుంటే ఒకవైపు పాఠశాలలు పనిచేయడం, మరోవైపు సర్వే కొనసాగుతుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### జిల్లాలో కుటుంబాల సంఖ్య..

వికారాబాద్ జిల్లాలో మొత్తం 2,63,362 కుటుంబాలు ఉండగా ప్రతి ఎన్యూమరేటర్ 175 కుటుంబాలకు సంబంధించిన సర్వే చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం 2024 మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను ప్రభుత్వం ఎన్యూమరేటర్లుగా నియమించింది. ఈ సర్వేను 208 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే వారందరికీ సర్వే చేపట్టాల్సిన విధానంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ నెల 19 నుంచి 27 తేదీ వరకు సర్వేకు సంబంధించి సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయనున్నారు. ఇందుకోసం మండలాలు, మున్సిపాలిటీలవారీగా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సర్వేలో మొత్తం 75 ప్రశ్నలుంటాయి.

---

# ఎవరికి వారే.. కాంగ్రెస్ తీరే !

జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలో మార్కెట్ కమిటీ పాలకవర్గాల ఫైట్ తీవ్రస్థాయిలో జరుగుతున్నది. చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం పార్టీ నేతల్లో తీవ్రమైన పోటీ నెలకొన్నది. మరోవైపు పాలకవర్గాల ఎంపిక కూడా ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. కొన్నిచోట్ల కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి, పాత వారికి మధ్య పోటీ ఉండగా.. పాత వారు నామినేటెడ్ పోస్టులను తమకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో జిల్లాలోని తొమ్మిది మార్కెట్ కమిటీల్లో ఇప్పటివరకు రెండు చోట్ల మాత్రమే పాలక వర్గాలను నియమించగా.. మరో ఏడు చోట్ల పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న వాటిలో ఒకటి రెండింటిపైనే ఏకాభిప్రాయం కుదిరినట్లు సమాచారం.

- రంగారెడ్డి, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ)

**'హస్తం'లో మార్కెట్ కమిటీల లొల్లి**

- చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం తీవ్రస్థాయిలో పోటీ..
- కొత్త వారికి ఇవ్వొద్దు.. తమకే ఇవ్వాలంటున్న పాతకాపులు
- ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారిన ఎంపిక ప్రక్రియ
- రంగారెడ్డి జిల్లాలో తొమ్మిది మార్కెట్ కమిటీల్లో..
- రెండింటికే పాలకవర్గాలు..మిగిలినవి పెండింగ్‌లో..

### రెండు పాలకవర్గాలు మాత్రమే..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 11 నెలల్లో ..జిల్లాలోని చేవెళ్ల, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీలకు మాత్రమే పాలకవర్గాలను నియమించింది. మిగతా వాటిలో శంకర్‌పల్లి, నార్సింగి రెండింటిపైనే ఏకాభిప్రాయం కుదిరింది. ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ పాలకవర్గ చైర్మన్‌గా.. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గురునాథ్‌రెడ్డి పేరు దాదాపుగా ఖరారైనా మంఖాల దాసు అనూహ్యంగా తెరపైకి వచ్చి చైర్మన్ పదవి తనకు ఇవ్వాలనడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికకు బ్రేక్ పడింది. అలాగే, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ఎంపికలోనూ నాయకుల మధ్య తీవ్ర పోటీ ఉన్నది. ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం యాట గీత, శ్రీనివాస్‌గౌడ్ పోటీపడుతున్నప్పటికీ గీత వైపే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. అదేవిధంగా మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్టీలకు కేటాయించగా.. రాజూనాయక్, కృష్ణానాయక్, పాండూనాయక్‌లు పోటీపడుతున్నారు. వీరిలో ఎవరిని ఎంపిక చేయాలో పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి తలనొప్పిగా మారింది. శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జనార్దన్‌రెడ్డి, నార్సింగి చైర్మన్‌గా వేణుగౌడ్‌లపై ఏకాభిప్రాయం కుదిరింది. అలాగే, సర్దార్‌నగర్‌మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వెంకట్‌రెడ్డి పేరును, ఆ పార్టీ ఇన్‌చార్జి భీంభరత్ సురేందర్‌రెడ్డి పేరును సూచించారు. దీంతో ఎమ్మెల్యే యాదయ్య, భీంభరత్ ఎవరికివారుగా తమ అనుచరులకు ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. షాద్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి సతీమణి సులోచన పేరు దాదాపుగా ఖరారైనట్లు సమాచారం. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పాలకవర్గాల ఎంపిక ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలకు కత్తిమీద సాములా మారింది.



### కొత్త.. పాతల మధ్య పోరు..

జిల్లాలోని మార్కెట్ కమిటీ పాలకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీలోకి కొత్తగా వచ్చిన నాయకులు, పాత నాయకులకు మధ్య పోరు తీవ్రంగా జరుగుతున్నది. కొన్నేండ్లుగా పార్టీలో ఉంటున్నామని.. వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవులు తమకే ఇవ్వాలని పాత నాయకులు పట్టుబడుతున్నారు. ఆయా ఎమ్మెల్యేలతో పార్టీలోకి వచ్చిన కొత్తవారు కూడా తమకు ప్రాధాన్యమివ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేవెళ్ల, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలతోపాటు పలు సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్‌కు చెందిన అనేక మంది నాయకులు కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఆయా సెగ్మెంట్లలో ఎమ్మెల్యేలను నమ్ముకుని వచ్చిన అనేక మంది డైరెక్టర్ల పదవి కోసం పోటీ పడుతున్నారు. కాగా, పార్టీ అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటినా సెగ్మెంట్లలో మార్కెట్ కమిటీ పాలకవర్గాలను నియమించకపోవటంపై క్యాడర్‌లో అసంతృప్తి నెలకొంది. వారిని బుజ్జగించే పనిలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు ఉన్నారు.




ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

---



- కేసీఆర్ హయాంలో నామమాత్రంగా ట్రాఫిక్ జరిమానాలు
- కాంగ్రెస్ పాలనలో రెట్టింపు అయ్యాయి
- నేటి నుంచే భారీ జరిమానాలు
- 2019 చట్టం అమలుపై అనుమానాలు
- ప్రమాదాలు నివారించడానికే గరిష్ఠ జరిమానాలు వసూలు : ట్రాఫిక్ అదనపు సీపీ

# డబుల్ చలాన్

నగరవాసుల నెత్తిన ట్రాఫిక్ పోలీసులు డబుల్ చలాన్లతో రెట్టింపు భారం వేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా హెల్మెట్ లేకుంటే రూ. 200, రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తే రూ. 2 వేల జరిమానా విధిస్తున్నారు. 2019లోనే కేంద్రం జరిమానాలు పెంచినా, అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఆ భారాన్ని రాష్ట్ర ప్రజలపై వేయలేదు, అప్పటికే రాష్ట్రంలో అమలులో ఉన్న పద్ధతినే కొనసాగించారు. దీంతో పాటు వాహనదారులు ఉల్లంఘనలకు పాల్పడకుండా, విస్తృతంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలంటూ ప్రజల్లో అవగాహన తెచ్చేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే ఇప్పుడు వాహనదారులు ఉల్లంఘనలకు పాల్పడితే జరిమానాలను వందశాతం అధికం చేసి రెట్టింపుగా వసూలు చేస్తున్నారు.

సిటీబ్యూరో, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): హెల్మెట్ ధరించని వారు, రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వారిపై మంగళవారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. సోమవారం వరకు హెల్మెట్ లేని వారికి రూ. 100, రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తే రూ. 1000 వరకు జరిమానా విధిస్తూ వచ్చారు. మంగళవారం నుంచి జరిగే స్పెషల్ డ్రైవ్‌లో హెల్మెట్ ధరించని వారికి రూ. 200, రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తే రూ. 2 వేల జరిమానా విధిస్తామంటూ ట్రాఫిక్ పోలీసులు ప్రకటించి, అమలులోకి తెచ్చారు. దీంతో ఒక్కసారిగా వాహనదారులు ఉలిక్కిపడ్డారు. 2019లో కేంద్రం భారీగా జరిమానాలు పెంచుతూ చట్టాన్ని చేసింది, అయితే దానిని ఇప్పుడు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పావులు కదుపుతున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిరోజూ కనీసం 18 వేల వరకు ట్రాఫిక్ ఉల్లంఘనలపై కేసులు నమోదవుతున్నాయి. వీటిని పెంచడంతో పాటు ధరలను కూడా పెంచడంతో రెట్టింపు ఆదాయం వస్తుందనే ఆలోచన జరుగుతుందా? ప్రస్తుతం హెల్మెట్, రాంగ్‌రూట్‌లకు జరిమానాలను పెంచి, నెమ్మదిగా మరింత భారం ప్రజలపై వేసేందుకు ఏవైనా సన్నాహాలు జరుగుతున్నాయా? అనే అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులకు జరిమానాలపై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పెట్టడం లేదని ఆరోపణలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీతో ప్రతి నిత్యం వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఎవరూ పట్టించుకోవడం లేదని, అలాంటిది జరిమానాలు వసూలు చేసుకోవడం, పెంచడం పైనే పోలీసులు, ప్రభుత్వం దృష్టి పెట్టిందంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### చలాన్లు రెండింతలు..!

మోటార్ వాహనాల చట్టం ప్రకారం కనిష్ఠం, గరిష్ఠంగా జరిమానాల రేట్లు ఉన్నాయి. అయితే పోలీసులు చలాన్ల నుంచి ఎక్కువ ఆదాయం రాబట్టేందుకు ప్రణాళిక చేపట్టారు. గతంలో కనిష్ఠం ఏదుంటే దానిని జరిమానాగా విధించేవారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ చలాన్లు పడకుండా వాహనదారులు చూసుకోవాలంటూ జాగ్రత్తలు చెప్పేవారు. ఒక చలానా పడిందంటే, మరో చలానా పడకుండా వాహనదారులు జాగ్రత్తలు తీసుకుంటూ నిబంధనలు పాటించేవారు. ఈ క్రమంలోనే రిపీటెడ్‌గా ఉల్లంఘనలకు పాల్పడే వారిని గుర్తించి వారికి కొన్నిసార్లు జరిమానాలు పెంచేవారు. నేడు మాత్రం ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించకుండా, ట్రాఫిక్ రద్దీలో వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తూ పండుగలు, పబ్బాలు అని కూడా చూడకుండా చలాన్ల వసూళ్లే ధ్యేయంగా ట్రాఫిక్ పోలీసులు పనిచేస్తూ, అసలు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విషయాన్ని మర్చిపోయారంటూ నగర వాసులు వాపోతున్నారు. ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించకపోవడం, రోడ్లపై విజుబుల్ పోలీసింగ్ కన్పించకపోవడంతో వాహనదారులు కూడా కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఘటనలున్నాయి.

### ప్రమాదాలు జరగకుండా చర్యలు

నగరంలో హెల్మెట్ ధరించకుండా ప్రయాణించే వారితో పాటు రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వారితోనూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల వరుసగా మూడు ఘటనల్లో ప్రాణాలు కోల్పోయారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలతో బయటపడేవారు. హెల్మెట్ ఉంటే ప్రమాదం సంభవించినప్పుడు 80 శాతం వరకు ప్రాణాలతో బయటపడే అవకాశాలుంటాయి. అయితే ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలనే ఉద్దేశంతోనే హెల్మెట్, రాంగ్‌రూట్‌లకు గరిష్ఠంగా రూ. 200, రూ. 2 వేల జరిమానా వేయాలని ఆదేశించాం. మేం కొత్తగా ఏదీ అమలు చేయడం లేదు, ఉన్న జరిమానాలనే అమలు చేస్తున్నాం. 2019 కేంద్రం పెంచిన జరిమానాలకు, మేం చేపట్టిన డ్రైవ్‌కు ఎలాంటి సంబంధం లేదు.

–ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్